




# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 3 | సంచిక : 341 | ఆగస్టు 9 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ

### శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

డీలిమిటేషన్ కు మద్దతు ప్రకటించిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్

గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన శిరోమణి అకాలీదళ్

ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు

శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో

(మిగతా 2వ పేజీలో..)



## నేనేమీ బాబా బాగేశ్వర్‌ను కాదు.. ఐఐటీ ఢిల్లీ విద్యార్థులను నవ్వించిన ప్రధాని


ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో విద్యార్థులతో సరదాగా మాట్లాడిన ప్రధాని

భవిష్యత్తు, జీతాలు, స్టార్టప్‌లపై ఆలోచిస్తున్నారంటూ వ్యాఖ్యలు

3 వేల మందికిపైగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం

“ఆడపిల్లలు మరింత మంది ఉండాలి” అంటూ మోదీ చమత్కారం

క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుంటారు: మోదీ




ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ ఢిల్లీ లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు.‘మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు’ అని మోదీ సరదాగా వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తంచేశారు. ఈ వేడుకలో మూడు వేల మందికిపైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ‘ఈ రోజు మీ కుటుంబసభ్యులు ఎంత గర్వపడుతున్నారో నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నా. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం

(మిగతా 2వ పేజీలో..)

## దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం:

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి

కుటుంబానికి అండగా నిలిచేందుకు కేసీఆర్ కీలక నిర్ణయం

2



## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్

నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్

24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్

ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో

(మిగతా 2వ పేజీలో..)



## ఖజానా ఖాళీ.. ఉచిత పథకాలే కారణం: తెలంగాణ హైకోర్టు

ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆందోళన

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో పడుతుందని హెచ్చరిక

2



## రాహుల్ గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది.. కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు

‘ఆస్క్ మీ ఎనీథింగ్’లో మహిళల స్వేచ్ఛపై రాహుల్ కీలక వ్యాఖ్యలు

మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పాలని వ్యాఖ్య

రాహుల్ వ్యాఖ్యల్లో మార్పు కనిపిస్తోందని రిజిజు కామెంట్

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతివ్వాలని వినతి

డీలిమిటేషన్ బిల్లుపై రాహుల్‌తో ఫోన్‌లో మాట్లాడిన రిజిజు

మహిళల స్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన ‘ఆస్క్ మీ ఎనీథింగ్’ కార్యక్రమంలో మహిళలు తమ

(మిగతా 2వ పేజీలో..)



## హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు..

### సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట..

సరూర్‌నగర్ స్టేడియానికి వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

2



## చర్చలకు సిద్ధం.. కానీ లొంగిపోయే ప్రసక్తే లేదు: ఇరాన్ అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు

6



## అభివృద్ధి చేయగానే ప్రజలు ఓట్లు వేయరు..

నా అనుభవంతో చెబుతున్నా: మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి

అభివృద్ధికి, ఓట్లకు సంబంధం లేదని కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్య

కోట్లు ఖర్చుపెట్టి అభివృద్ధి చేసినా.. ఎన్నికల్లో మెజారిటీ భారీగా తగ్గిపోయిందని వెల్లడి



6

# చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు: చంద్రబాబు

టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు

గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు


ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన

డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి

పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక

ప్రతి ఎన్నికలోనూ గతంలో కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్య నిర్దేశం

ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ‘గొడ్డలి పార్టీ’ చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన



శిక్షణా తరగతులకు ఆయన

(మిగతా 2వ పేజీలో..)

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా బీజేపీ శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

మొదటి పేజీ తరువాయి)

సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ – అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి. ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మళ్లీ కమలం పార్టీతో జతకట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు పలకడం కూడా ఈ పొత్తు సంకేతాలలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త మైత్రికి దారితీస్తుందనే చర్చలు జోరందుకున్నాయి.

## రాహుల్ గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది.. కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలని రాహుల్ అన్నారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ అంశంపై మరింత వివరంగా స్పందించారు. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు.మహిళల్లో ఉన్న శక్తి పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదని రాహుల్ అన్నారు. మహిళలు తమకు నచ్చిన విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాలని చెప్పారు. ఇళ్లలో, కుటుంబాల్లో, సమాజంలో తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు అంగీకరించని విషయాలపై కూడా మహిళలు తమ అభిప్రాయం చెప్పగలగాలని అన్నారు. పురుషుల ఆధిపత్యం నుంచి మహిళలకు కొంత స్వేచ్ఛ అవసరమని చెప్పారు. అప్పుడే దేశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని రిజిజు అన్నారు. “మహిళల విషయంలో రాహుల్‌గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నాను” అని చెప్పారు.మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా ఈ చట్టం ఉంది. అయితే దీని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరం.ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లును తిరిగి తీసుకొచ్చేందుకు విపక్షాల మద్దతును ప్రభుత్వం కోరుతోంది. రాహుల్‌గాంధీతో గురువారం రిజిజు ఫోన్‌లో మాట్లాడారు. బిల్లును త్వరగా తీసుకొస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగంగా జరిగే అవకాశం ఉందని వివరించారు. మహిళా రిజర్వేషన్లు అమలు కాకపోతే వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని చెప్పినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.2026 రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందలేదు. ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టే అంశంపై ప్రభుత్వం, విపక్షాల మధ్య చర్చ కొనసాగుతోంది.

## ఖజానా ఖాళీ.. ఉచిత పథకాలే కారణం: తెలంగాణ హైకోర్టు

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో అమలు చేస్తున్న ఉచిత పథకాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పథకాల వల్ల రాష్ట్రంలో త్వరలోనే తీవ్రమైన ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించింది. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడానికి ఈ ఉచిత పథకాలే ప్రధాన కారణమని జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది.కంటోన్మెంట్ బోర్డుకు సర్‌ఛార్జి బకాయిల చెల్లింపునకు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. “కోటీశ్వరులకు రైతుబంధు, లగ్జరీ బైక్‌లపై తిరిగే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎలా ఇస్తారు?” అని ధర్మాసనం ప్రభుత్వాన్ని నిలదీసింది. “ఉచితాల వల్ల గ్రామాల్లో కూలీలు దొరకక రైతులు ఏడుస్తున్నారు. ప్రజలు కష్టపడి పనిచేసే రోజులను వీడియోల్లో చూసుకోవాల్సిన పరిస్థితి వస్తోంది” అని ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర జనాభా కన్నా రేషన్ కార్డుల్లో ఉన్న సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ కేసులో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా కోర్టుకు హాజరయ్యారు. కంటోన్మెంట్ బోర్డుకు రూ. 25.45 కోట్లు విడుదల చేశామని, మిగతా మొత్తాన్ని వాయిదాల్లో చెల్లిస్తామని ఆయన వివరించారు. ఆయన వివరణతో సంతృప్తి చెందిన ధర్మాసనం, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఇదే విచారణలో భాగంగా, పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లోగా ఈ ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది.

## దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం:

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం అందించనుండగా, వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేయనున్నారు.పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేసీఆర్ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించిన చర్యలను అమలు అమలు చేస్తారని కేసీఆర్ తెలిపారు

# నేనేమీ బాబా బాగేశ్వర్‌ను కాదు.. ఐఐటీ ఢిల్లీ విద్యార్థులను నవ్వించిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి)

కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు' అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. 'ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి కొందరు కాదు, చాలామంది ఉండాలి' అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి. అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై–పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ సూచించారు.

# చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, “ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి” అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. “పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు” అని చంద్రబాబు వివరించారు.ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం–అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు.. సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట..

హైదరాబాద్‌లో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో చెప్పేందుకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ఘటనే నిదర్శనం. 'హైడ్రా' ప్రకటించిన 150 పోస్టుల కోసం వేలాది మంది యువత తరలిరావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. హైడ్రా విభాగంలో 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాలని సూచించారు.అయితే, ప్రకటించిన పోస్టుల కంటే కొన్ని వందల రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు ఇవాళ తెల్లవారుజామునకే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి, గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 150 ఉద్యోగాలకే ఈ స్థాయిలో పోటీ ఉందంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం
ఆగస్టు । ఆదివారం । 9 । 2026




# ఉత్తర, తూర్పు జిల్లాలకు కీలక సూచన..!

**మన దునియా,హైదరాబాద్, ఆగస్టు 08**

తెలంగాణలో శనివారం రోజు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో సాయంత్రం నుంచి వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. శనివారం ఉదయం 9.30 గంటల వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ రోజు మధ్యాహ్నం వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో హైదరాబాద్‌తో సహా, వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. సాయంత్రం నుంచి వర్షాలు. సాయంత్రం నుంచి రేపటి రోజు తెల్లవారుజాము వరకు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులకు ఆనుకుని ఉన్న ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పశ్చిమ, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

**హైదరాబాద్‌లో పరిస్థితి.**

హైదరాబాద్‌లో మధ్యాహ్నం వరకు వాతావరణం పొడిగా ఉండే




అవకాశం ఉంది. సాయంత్రం నుంచి రాత్రి సమయంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చెదురు మదురు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మొత్తంగా ఉదయం కొన్ని ఉత్తర, తూర్పు జిల్లాల్లో వర్షాలు ఉండగా, సాయంత్రం నుంచి ఉత్తర, తూర్పు తెలంగాణలో వర్షాల విస్తృతి పెరిగే అవకాశం ఉంది.

# నేనే ప్రకృతినీ -ఆదివాసీలా ఆకృతిని. మీరు చేస్తున్న వికృతిని

నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని మీరు చేస్తున్న వికృతిని మీకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని ఇచ్చేదాన్ని కనిపించి కనిపించని ఊహ లోకాన్ని ప్రతి శ్వాసనాది, నీశ్వాస నాది పొంగిపొరలుతున్న గోదావరి నాది ,నీటఎగురుతున్న కెరటాలు నావి , "నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని " ,నీవు కలం పట్టాలన్నా,గళం విప్పాలన్నా ,మాటలాడాలన్నా, మనసు విప్పాలన్నా ,నీవు పొందుతున్న పరవశానికి, ముగ్దుడవయ్యే సౌందర్యానికి ,పక్షుల కిల్లకిల చప్పుడు నాది ,ఆమని తియ్యని పాటలు నావి ,రూపంటు తెలియని అజ్ఞాతపు శిలను నేను , "నేనే ప్రకృతిని ఆదివాసీల ఆకృతిని ",మీరు నా రెక్కలు ముక్కలుగా నరుకుతుంటే నా ఎర్రని రక్తాన్ని మబ్బులుగా చేసి ,కంటిరెప్పల జలాల నుండి తుపానులై ,వడి వాడిగా త్వర త్వరగా వర్షాన్నై వచ్చేస్తా ,కొండకొనలనుండి వాగులను నడిపిస్తా ,ఎండిన మీ పొలాలకు జీవం నేనే పోస్తా ,లేలేత కిరణాలతో అజ్ఞానం తొలిగిస్తా.," నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని ",లేలేత చిగురాకులు పక్షులకు ఇచ్చేస్తా ,పసిడి పైరు లన్నింటిని మీకే అందిస్తా.,నీ చెల్లి నవ్వు నాది ,విరబూసిన పువ్వు నాది ,కోకిల రాగం నాది వేణువు గానం నాది.,పాల బుగ్గల పసిపాప బోసినవ్వులు నావి ," నేనే ప్రకృతిని ఆదివాసిల ఆకృతిని ",ఆకుపచ్చని బొట్టును నేను ,ఆచారాల అమ్మను నేను ,గూడెం గుండెల చప్పుడు నేను ,కట్టుబాటులకు నిలయం నేను ,అందరికి అడవమ్మను నేను , నేనే ప్రకృతినీ ఆదివాసీల ఆకృతిని ,కొమ్ము సైరాన్ కూతలు నావే ,డోలు దరువుల ధ్వని నాదే ,గుస్సాడి శృంగపు నృత్యం నాదే ,రేలారే రేలా పాటలు నావే ,తుడుం మోతల చప్పుడు నాదే ,జీవం పుట్టుక అన్నీ నావే , నేనే ప్రకృతినీ ఆదివాసీల ఆకృతిని ,విశ్వం ఎరిగిన జ్ఞానిని నేనే ,అడవి తల్లి బిడ్డని నేనే ,ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ఆప్తున్నీ నేనే హక్కుల్ని కోల్పోతున్న ,ఒంటరిని నేనే ,సమాజంచూస్తూ గతం మరిచిన సమిదను నేనే , నేనే ప్రకృతినీ ఆదివాసిల ఆకృతిని ,

మీ.. Kk
కల్తీ. క్రిష్ణమూర్తి
తెలుగు పండిట్
సెల్ నం "9494036818
AHS రాయినిగూడెం.



# తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల్లో భారీ స్కాం..!

**ఒకే ఆధార్ నంబర్, రెండు పేర్లు. రెండు ఉద్యోగాలు.**

**వేర్వేరు శాఖల్లో ఉద్యోగులుగా లక్షల జీతాలు దోచుకుంటున్న అక్రమార్కులు.**

**40 అనుమానాస్పద కేసుల్లో 80 మంది డూప్లికేట్ ఉద్యోగుల గుర్తింపు.**

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 08**

తెలంగాణలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, వైద్య, విద్యా శాఖల్లో దాదాపు 80 మంది నకిలీ ఉద్యోగులను గుర్తించిన ఆర్థిక శాఖ, ఒకే ఆధార్ నంబర్‌పై, రెండు పేర్లు, రెండు ఉద్యోగాలు చేస్తూ, రెండు శాఖల నుంచి లక్షల్లో జీతం దోచుకుంటున్న డూప్లికేట్ ఉద్యోగులు. ఉద్యోగుల ఆధార్ కార్డు వివరాలు పరిశీలించే క్రమంలో బయటపడిన కుంభకోణం, ఒకే ఆధార్ నంబర్‌పై ఓ శాఖలో పురుషుడిగా, మరో శాఖలో మహిళగా నమోదైన ఉద్యోగి, మరో ఆధార్ నంబర్‌పై ఒక శాఖలో ఒక మతం పేరు, మరో శాఖలో మరో మతం పేరుతో ఉద్యోగిగా నమోదైనట్టు గుర్తింపు. వీరంతా రెగ్యులర్ ఉద్యోగులు కావడం గమనార్హం. ప్రజారోగ్య శాఖలో డి.ప్రమీల రాణి, కె.ప్రమీల పేరుతో ఒకే ఆధార్ నంబర్‌పై రెండు ఉద్యోగాలు. విద్యా శాఖలో కిందింటి మోహన్ రెడ్డి, బసిరెడ్డి మోహన్ రెడ్డి పేర్లతో ఒకే ఆధార్ నంబర్‌పై రెండు ఉద్యోగాలు. రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ విభాగంలో డి.లావణ్య, రమాదేవి పేరిట ఒకే ఆధార్ నంబర్‌పై రెండు ఉద్యోగాలు. రెవెన్యూ శాఖలో అన్నపూర్ణ, డీజీపీ కార్యాలయంలో అన్నపూర్ణ పేరిట ఒకే ఆధార్ నంబర్‌పై రెండు ఉద్యోగాలు, రెండు జీతాలు. పంచాయతీ రాజ్ శాఖలో సంతోష్ కుమార్ నీలకంఠ, బీర సతీష్ రెడ్డిల పేరిట ఒకే ఆధార్ నంబర్‌పై రెండు ఉద్యోగాలు, అదే శాఖలో చిలుకూరి సుదర్శన్, పలస ముత్యాలు పేరిట డూప్లికేట్ ఉద్యోగాలు గుర్తింపు. ఇలా అనేక శాఖల్లో ఒకే ఆధార్ నంబర్‌తో రెండు ఉద్యోగాలు చేస్తున్నట్టు నకిలీ పత్రాలు సృష్టించి లక్షల్లో జీతాలు కొల్లగొడుతున్న డూప్లికేట్ ఉద్యోగులు. కేవలం మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే ఒక్కో డూప్లికేట్ ఉద్యోగి దాదాపు రూ. 5 లక్షల జీతం అందుకున్నట్టు గుర్తించడంతో విచారణకు ఆదేశించిన చీఫ్ సెక్రటరీ. అని అన్నారు.




# యాదవుల హక్కులకోసం సమస్యల కోసం నిత్యం పోరాడుతాం

**మన దునియా, ఆగస్ట్ 08,మంచిర్యాల జిల్లా**



మందమర్రి పట్టణంలో అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బండి సదానందం యాదవ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్నటువంటి అన్ని మండలాల అధ్యక్షులు మున్సిపల్ టౌన్ ప్రెసిడెంట్లతో ఏర్పాటు చేసి గతంలో వేసుకున్నటువంటి యాదవ సంఘం జిల్లా మండల కమిటీలను పరిశీలించి మళ్లీ రాష్ట్ర అధ్యక్షులు ఆదేశం మేరకు అతి త్వరలోనే జిల్లాలో ఉన్నటువంటి అన్ని మున్సిపాలిటీలు మండలాలు గ్రామాలకు సంబంధించిన యాదవ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు శనివారం మందమర్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బండి సదానందం యాదవ్ యాదవులకు పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని జిల్లాలో ఉన్నటువంటి యాదవులు అందరు గమనించాలని కోరుతూ రాబోవు రోజుల్లో యాదవుల హక్కుల కోసం యాదవుల సమస్యల కోసం గౌరవనీయులైన చెన్నూరు శాసనసభ్యులు రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి అదేవిధంగా పెద్దపల్లి డైనమిక్ పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఆశీస్సులతో జిల్లాలోని యాదవ భవనాలు యాదవ భవనంతో పాటు ఏ సమస్యలు ఉన్నగాని వారి దృష్టికి తీసుకెళ్లి జిల్లాలో ఉన్న యాదవులు అందరికీ న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బండి సదానందం యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు గంగాధర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అల్లంల పావన్న యాదవ్, అల్లంల నాగన్న యాదవ్,జన్నారం మండల ప్రెసిడెంట్ బొంతల మల్లేష్ యాదవ్,మందమర్రి టౌన్ ప్రెసిడెంట్ సిలివెరీ గోపాల్,మందమర్రి యూత్ అధ్యక్షులు కత్తెర్ల సంజీవ్, మందమర్రి వైస్ ప్రెసిడెంట్ సందనవేణి సంజీవ్ యాదవ్, రేణి సత్తన్న, అమరగాని ఐలయ్య,పిండి ఐలయ్య,కోట రాజన్న,మద్దూరి రాములు,కోట రాజన్న,కూకట్ల పోషం, నాగనవేణి కృష్ణ, జిల్లా మండల యాదవ సోదరులు పాల్గొన్నారు.

# సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి

**మన దునియా, ఆగష్టు 08,మంచిర్యాల జిల్లా**



మందమర్రి ఏరియా సింగరేణి సెక్యూరిటీ సంస్థలో ఉన్న పలు సమస్యలపై ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ జనరల్ కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ డా జనక్ ప్రసాద్ కి తెలియజేయగా వారి ఆదేశాల మేరకు ఏరియా ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య ఆధ్వర్యంలో సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి కి కేంద్ర కమిటీ జాయింట్ సెక్రెటరీ జగన్నాథ చారి వినతి పత్రం అందజేశారు.. సెక్యూరిటీ ఆఫీసర్ సానుకూలంగా స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సెక్యూరిటీ సంస్థలో ఉన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రటరీ జంగం శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ కె.ఆర్ సంపత్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చంద్రగిరి మురళి, ఫిట్ కమిటీ సభ్యులు సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ఘనంగా బోనాల జాతర సంబరాలు

**మన దునియా, ఆగస్ట్ 08,మంచిర్యాల జిల్లా**

తెలంగాణ రాష్ట్రంలో ఆషాడమాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండగ బోనాలాజాతారా, ఈరోజు బోనాల జాతర సంబరాలను మందమర్రి పట్టణంలోని హైదరాబాద్ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ప్రిన్సిపాల్ గుణవతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు వివిధ వేషాదారనలతో బోనమెత్తి, నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు ముఖ్యంగా పోతురాజు వేషం చాలా ఆకట్టుకుంది, ఈరోజు సందర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈరోజుల్లో పిల్లలకు ప్రతిఒక్క పండగ యొక్క ప్రాముఖ్యతను తెలియచేసే అవసరం ఎంతైనా ఉంది అని, ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు చిన్నతనం నుండి పండగల ప్రత్యేకతలు, మన సంస్కృతి, మన ఆచారాలు ఎలా ఉండాలి, ఎలా గౌరవించు కోవాలి అనేది స్పష్టంగా తెలియచేస్తే రానున్న తరాలకు మన పండగల విశిష్టత గుర్తుకు ఉంటాయి అని అన్నారు, సెల్ ఫోన్ లకే అంకితం అవుతున్న పిల్లలు రాను రాను మన సంస్కృతిని మర్చిపోతారేమో అని భయం వేస్తుంది కాబట్టి బోనాల జాతర, ఇంకా మన పండగలను ఘనంగా జరుపుకున్నప్పుడే ఇలాంటి విషయాలు మర్చిపోకుండా ఉంటారు అని గుణవతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు రాం తిరుమల, శ్రీజ, షరీనా, స్పందన, శివాని, శ్రీనివాస్, సతీష్, కృష్ణమోహన్ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## ప్రియురాలి దారుణ హత్య.. కత్తితో పొడిచి, పెట్రోల్ పోసి నిప్పంటించిన ప్రియుడు

### మిస్సింగ్ కేసును ఛేదించిన అర్బన్ రమేష్ ... నిందితుడి అరెస్ట్

**మన దునియా,చిలకలూరిపేట: ఆగస్టు 08**

చిలకలూరిపేట: ప్రేమించిన యువతి తనను కాదని వేరొకరికి దగ్గరవుతోందనే అనుమానంతో ఓ ఉన్మాది ప్రియురాలిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఆపై సాక్ష్యాధారాలు మాయం చేసేందుకు మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేసి అసలు గుట్టు రట్టు చేశారు. ఈ దారుణ ఘటనకు సంబంధించిన వివరాలనుడి.ఎస్.పి ఎం. హనుమంతురావు శనివారం వెల్లడించారు.

ప్రేమ, అనుమానం.. పథకం ప్రకారమే హత్య

చిలకలూరిపేట పట్టణం వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్ వలి కుమార్తె షేక్ హసీనా, యాస్మిన్ (23) తుమ్మలపాలెం హైవే వద్ద ఉన్న మిట్టపల్లి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం సూళ్లూరుపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. గుంటూరులోని చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువును మధ్యలో ఆపేసి, ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్న కారంపూడి మండలం ఇనుపరాజుపల్లికి చెందిన జినుగు బాల సైదులు (25), హసీనాలు గత నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు.అయితే, ఇటీవల హసీనా తనతో తక్కువగా మాట్లాడుతుండటంతో.. ఆమె వేరే వ్యక్తికి దగ్గరవుతోందని, తనను కావాలనే దూరం పెడుతోందని సైదులు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆమెను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 4వ తేదీన హసీనాకు ఫోన్ చేసిన సైదులు, మాయమాటలు చెప్పి కారంపూడికి రప్పించాడు. మాట్లాడుకుందామని నమ్మించి, అక్కడి నుంచి కారంపూడి – నకరికల్లు రోడ్డులోని ఎన్ఎస్పీ కాలువ పశ్చిమ కట్ట వద్ద ఉన్న ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు.

**కత్తితో పొడిచి.. పెట్రోల్ పోసి దహనం**

ఎవరూ లేరని నిర్ధారించుకున్న సైదులు, ముందుగానే తన వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో దాడికి పాల్పడ్డాడు. తన ఎడమ చేతితో



హసీనా గొంతు గట్టిగా పట్టుకుని, ఆమె కడుపులో మూడుసార్లు బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో హసీనా అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. హత్య అనంతరం సాక్ష్యాధారాలు దొరక్కుండా చేసేందుకు, తన బైక్‌లోని పెట్రోల్‌ను ఓ ఖాళీ వాటర్ బాటిల్‌లో పట్టి, మృతదేహంపై పోసి నిప్పంటించి అక్కడినుంచి పరారయ్యాడు.

**మిస్సింగ్ కేసు విచారణలో వెలుగులోకి..**

కూతురు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడం, కనిపించకుండా పోవడంతో బాధితురాలి తండ్రి మస్తాన్ వలి చిలకలూరిపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ జె.వి. సంతోష్, నరసరావుపేట డి.ఎస్.పి ఎం. హనుమంతురావు ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు.సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టిన పోలీసులు.. ఆగస్టు 8న కారంపూడి పాత సినిమా హాలు సెంటర్ (హోండా షోరూం) వద్ద నిందితుడు సైదులును చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. మహిళ అదృశ్యం కేసును హత్య కేసుగా (Cr No 214/2026 u/s 103(1), 140(1), 238 BNS) మార్చారు. నిందితుడిని కోర్టులోహాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించడంలో చిలకలూరిపేట టౌన్ సీఐ పి. రమేష్, ఎస్ఐలు వి. సోమేశ్వరరావు, పి. హజరత్తయ్య, మరియు వారి సిబ్బంది కీలక పాత్ర పోషించటం జరిగిందని తెలిపారు.

## ప్రైవేటు స్కూళ్లు లెక్కలివ్వవు.. విద్యాశాఖ షోకాజ్ నోటీసులు



**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 08**

ప్రైవేటు స్కూళ్లు లెక్కలివ్వవు.. విద్యాశాఖ షోకాజ్ నోటీసులు తెలంగాణ : రాష్ట్రంలోని 13,245 ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వానికి ఆడిట్ రిపోర్టులు సమర్పించకుండా తప్పించుకుంటున్నాయి. ఫీజుల దందాను దాచిపెట్టేందుకే ఈ రిపోర్టులు ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. కేవలం 16 స్కూళ్లు మాత్రమే లెక్కలు సమర్పించడంతో, విద్యాశాఖ సీరియస్ అయింది. లెక్కలు ఇవ్వని 13,229 స్కూళ్లకు తక్షణమే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని కూడా సూచించారు.

## పింఛన్‌దారుడు మరణిస్తే భాగస్వామికి వెంటనే పెన్షన్!

**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 08**



తెలంగాణ : పింఛన్‌దారుడు మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పెన్షన్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'చేయూత' పథకంలో భాగంగా దివ్యాంగులు, అనారోగ్య బాధితుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా భార్య లేదా భర్తకు పెన్షన్ ఇవ్వబడుతుంది. వితంతువులు, ఒంటరి మహిళలకు ఈ విషయంలో ప్రాధాన్యం ఉంటుంది. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేసేందుకు వీలుగా డీఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ప్రత్యేక లాగిన్ సదుపాయం అందుబాటులోకి తెచ్చారు.

## సోషల్ మీడియా ముసుగులో వసూల్ దందా..?

### ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులపై ఫిర్యాదులు..



**మన దునియా,మంథని:ఆగస్టు 08**

మంథని పట్టణంలో ఓ వ్యక్తి వ్యవహారశైలి పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వినిపిస్తు న్నాయి. సోషల్ మీడియా అనే ముసుగులో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నా రనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మంథనిలో జరుగు తున్న అభివృద్ధి పనులకు సంబంధిం చిన కాంట్రాక్టర్లను సైతం బెదిరించి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా సోషల్ మీడియాను అడ్డు పెట్టుకుని వ్యక్తులపై అసత్య ప్రచారాలు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారానికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, వాటిని పరిశీలించి త్వరలో వాస్తవాలను ప్రజల ముందుంచుతామని మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.ఇలాంటి వసూళ్లు, బెదిరింపు లకు ఎవరైనా బాధితులై ఉంటే సంబంధిత ఆధారా లతో మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌ను సంప్రదించవచ్చు.

## జిల్లాలో పోలీసు నిఘా వ్యవస్థను పటిష్టపర్చాలి : డీఐజీ భాస్కరన్





**నిజామాబాద్ జిల్లా: ప్రతినిధి మన దునియా**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు నిఘా వ్యవస్థను పటిష్టపర్చాలని బాసర జోన్‌--2 డీఐజీ భాస్కరన్ పేర్కొన్నారు.నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు నిఘా వ్యవస్థను పటిష్టపర్చాలని బాసర జోన్--2 డీఐజీ భాస్కరన్ పేర్కొన్నారు. శనివారం బోధన్‌పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**రికార్డుల పరిశీలన**

మొదటగా స్టేషన్‌లో సిబ్బందికి అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలు, ఆయుధాల నిర్వహణ, రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు డీఐజీ సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ఫిర్యాదుల నమోదు విధానం, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి, వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. స్టేషన్‌లో అమలవుతున్న '5 ఎస్ విధానం' తీరును సమీక్షించారు. మహిళలు, వృద్ధులు, అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు.

**సరిహద్దులో ఉన్నందున..**

బోధన్ పోలీస్ స్టేషన్ మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నందున అన్ని ప్రధాన రహదారులపై నిఘా పటిష్టపరిచాలని ఆదేశించారు. ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్?ఫోర్స్?మెంట్? చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్?లైన్? బెట్టింగ్స్,




ఆన్?లైన్? గేమ్స్ ఆడుతూ సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతున్నారన్నారు. వాటిని నిలువరించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ ఎస్?హెచ్?వో వెంకటనారాయణ, బోధన్ ట్రాఫిక్ ఎస్సై మహేష్, బోధన్ టౌన్ ఎస్సై హబీబ్ ఖాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# కొలనుపాకలో తెలంగాణ వీర శైవ జంగమ రూప దీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం

- అడాక్ కమిటీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా శివ శ్రీ గొంగళ్ల మఠం రాజేంద్రప్రసాద్
- ప్రధాన కార్యదర్శిగా సదా నిరంజన్ సిద్ధాంతి
- 300 మంది అర్చకుల సమక్షంలో కార్యాచరణకు శ్రీకారం

**మన దునియా,యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక: ఆగస్టు 08**



యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక గ్రామంలో తెలంగాణ వీరశైవ జంగమ ధూపదీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది వీర శైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకులు ఈ సమ్మేళనానికి హాజరై అర్చకుల సమస్యలు సంక్షేమం భవిష్యత్ కార్యాచరణ పై విస్తృతముగా చర్చించారు ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ధూపదీప నైవేద్య అర్చకులకు అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సమావేశం ఏగాగ్రీవంగా కోరింది అర్చకులకు ప్రభుత్వ గుర్తింపు సామాజిక భద్రత ఆరోగ్య బీమా పింఛన్ గౌరవ వేతనం దేవాలయాల్లో సేవల నిర్వాహనకు అవసరమైన సౌకర్యాలు ఆర్థిక పరిరక్షణ వంటి అంశాలపై చర్చించారు మారుతున్న కాలంలో అర్చకులకు ప్రభుత్వం నుండి వచ్చే ధూప దీపానికి 4000 రూపాయలు ఆరువేల రూపాయలు గౌరవేతనం ఏమాత్రం



సరిపోవటం లేదని కనీసం ధూపదీప నైవేద్యానికి మరియు అర్చకుని వేతనానికి కలిపి 25 వేల రూపాయలు ఇవ్వాలని అర్చకులు ప్రభుత్వాన్ని కోరారు ఈ సందర్భంగా తెలంగాణ వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకసంఘం రాష్ట్రస్థాయిలో అడక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు రాష్ట్ర సంఘం అధ్యక్షులుగా శివశ్రీ గొంగళ్ళ మఠం రాజేంద్రప్రసాద్ గారిని ప్రధాన కార్యదర్శిగా సదా నిరంజన్ సిద్ధాంతిని కోశాధికారిగా విభూతి పబ్లింగమును ఉపాధ్యక్షులుగా సురేష్ శాస్త్రిని వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆకావరం శివప్రసాద్ను గౌరవ అధ్యక్షులుగా గణపతి బుచ్చిలింగం చెల్పూర్ శంకరయ్య గారిని ఎన్నుకోవడం జరిగినది . ఈ యొక్క ఆత్మీయ సమ్మేళనం విజయవంతంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చకుల కు రాష్ట్ర అధ్యక్షుడు అర్చకుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని మన హక్కుల కోసం ప్రభుత్వం దగ్గర మన సూచనలు అందేలా చేస్తానని మాట ఇవ్వడం జరిగినది

# వసుధ పబ్లిక్ స్కూల్‌లో బోనాల పండగ వేడుకలు





**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండల కేంద్రంలో బోనాల పండుగ వసుధ పబ్లిక్ స్కూల్ నవీపేట్ లో ఈరోజు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు పోతరాజు మరియు అమ్మవారి వేషధారణలో నృత్యం చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో మొదట మహాకాళి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పాఠశాల ఉపాధ్యాయులు బోనాలు నెత్తిన పెట్టుకొని అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆషాడ మాసంలో అమ్మవారిని కలవటం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని అన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ న్యాయలకంటి శంకర్ విద్యార్థులకు బోనాల పండగ గురించి వివరిస్తూ అమ్మవారి దీవెనలతో సమాజంలో ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండాలని, వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో సమాజం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. చిన్నపిల్లలు మరియు ఆనందంగా బోనాల పండుగ నిర్వహించుకున్నామని చాలా చక్కగా వారి ప్రతిభను చాటారు ప్రకృతి తెలంగాణ సాంప్రదాయాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తూ పిల్లలతో బోనాల విశిష్ట గురించి వివరిస్తూ వసుధ స్కూల్ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ న్యాలకంటి చంద్రశేఖర్, ప్రిన్సిపల్ న్యాలకంటి శంకర్, వైస్ ప్రిన్సిపల్ ఠాకుర్ గంగా ప్రసాద్ సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు బృందం మరియు విద్యార్థులు, పోషకులు పాల్గొనడం జరిగింది.

# ఆలయ అన్నదాన శాలకు చల్లని సేవ

- పది సీలింగ్ ఫ్యాన్లు బహూకరించిన యువకులు
- భక్తితో దేవుని కొలిచారు.. సేవతో భక్తుల మనసు గెలిచారు
- పూజతోనే కాదు.. సేవతోనూ దైవారాధన
- సోషల్ మీడియా దయాకర్ రెడ్డి

**మన దునియా,కొత్తూరు:ఆగస్టు 08**

కొత్తూరు మండలం:భక్తి ఉన్న చోట సేవా స్ఫూర్తి వెల్లివిరుస్తుంది.. మానవత్వంతో చేసే చిన్న సహాయం కూడా ఎంతోమందికి ఎంతో సౌకర్యాన్ని అందిస్తుంది. ఈ సేవా భావంతో కొత్తూరు మండలానికి చెందిన సోషల్ మీడియా దయాకర్ రెడ్డి ముందుకు వచ్చారు. కొత్తూరు మండలానికి చెందిన దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ గట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలోని అన్నదాన శాలకు పది సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఆలయ పూజారులకు ఫ్యాన్లను అందజేసి, భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు తమ వంతు సహాయాన్ని అందించారు.అన్నదానానికి వచ్చే భక్తులు ఉక్కపోతతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ ఫ్యాన్లను అందించినట్లు సోషల్ మీడియా దయాకర్ రెడ్డి తెలిపారు."దైవ సేవలో భక్తి ఎంత గొప్పదో..భక్తుల సేవలో మానవత్వం అంతే గొప్పది.చేసిన సేవ చిన్నదైనా..అందించే సంతోషం మాత్రం ఎంతో పెద్దది."అని సేవా స్ఫూర్తిని చాటారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు దయాకర్ రెడ్డి ను అభినందిస్తూ, వీరాంజనేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ వారికి ఉండాలని ఆకాంక్షించారు.




# సాగునీటి లభ్యతపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి

- క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నీటి పరిస్థితులపై నిఘా పెట్టాలి
- ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు చేపట్టాలి
- చెక్‌డ్యామ్‌లను తరచూ తనిఖీ చేసి నీటి నిల్వలపై దృష్టి సారించాలి
- భూగర్భజలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- పంట మార్పిడిని ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించాలి
- అటవీ జంతువులు, కూలీల కొరత వంటి సమస్యలకు పరిష్కారం చూపాలి



**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సాగునీటి లభ్యత, నీటి వనరుల పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాభూపతి రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన నిజామాబాద్ జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పాల్గొన్న..ఎమ్మెల్యే పలు కీలక అంశాలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో అత్యధికంగా రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నందున, సాగునీటి లభ్యత విషయంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువులు, కాలువలు, చెక్‌డ్యామ్‌లు, ఇతర నీటి వనరుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కోరారు.వర్షపు నీటిని సాధ్యమైనంత ఎక్కువగా ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంపొందించే చర్యలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. చెక్‌డ్యామ్‌లను విరివిగా తనిఖీ చేస్తూ వాటి పనితీరు, నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు.నీటి వనరుల పరిరక్షణతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.నిజామాబాద్ జిల్లాలో పంట మార్పిడి ఆశించిన స్థాయిలో జరగలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అత్యధిక మంది రైతులు వరి పంట సాగుకే మొగ్గుచూపుతున్నారని, దీనివల్ల సాగునీటి వినియోగంపై మరింత ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.అయితే పంట మార్పిడికి రైతులు ముందుకు రాకపోవడానికి కేవలం అవగాహన లోపమే కారణం కాదని, పలు ఆచరణాత్మక సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యంగా అటవీ పందులు, కోతులు వంటి వన్యజీవుల బెడద కారణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదన్నారు. పంటలను అటవీ జంతువుల నుంచి రక్షించేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవసాయ రంగంలో కూలీల కొరత కూడా పంట మార్పిడికి ఒక అవరోధంగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. ఇతర రాష్ట్రాల్లో పంటల సాగు, యాంత్రీకరణ, వన్యజీవుల నియంత్రణ, కూలీల కొరత వంటి సమస్యలను ఎలా అధిగమిస్తున్నారో అధ్యయనం చేసి, అక్కడ అమలవుతున్న ఉత్తమ విధానాలను నిజామాబాద్ జిల్లాలోనూ అవసరానికి అనుగుణంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. సాగునీటి వనరుల సమర్థ వినియోగం, భూగర్భజలాల పెంపు, పంట మార్పిడి, వన్యజీవుల నుంచి పంటల రక్షణ, కూలీల కొరత పరిష్కారం వంటి అంశాలపై సమన్వయంతో పనిచేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# అభివృద్ధి చేయగానే ప్రజలు ఓట్లు వేయరు..



ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.. అభివృద్ధి చేస్తే ప్రజలు గెలిపిస్తారా? వారి సమస్యలు తీరిస్తే ఓట్లు వేస్తారా? అనే అంశంపై తన రాజకీయ అనుభవాన్ని రంగరించి ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. అభివృద్ధి చేసినంత మాత్రాన ఎన్నికల్లో గెలుస్తామనుకోవడం పొరపాటని, ఓట్లు మానవ సంబంధాలపై ఆధారపడి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఎదురైన ఒక సంఘటనను ఉదాహరణగా చూపుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తన సొంత నియోజకవర్గమైన పీలేరులోని 'మంచాలమంద' అనే మారుమూల గ్రామం గురించి కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. "ఆ గ్రామానికి 9 కిలోమీటర్ల వరకు సరైన రోడ్డు ఉండేది కాదు. 1989లో ఎమ్మెల్యే అయినా, 2002 వరకు నేను ఆ ఊరికి వెళ్లలేకపోయాను. దాదాపు 800-900 ఓట్లున్న ఆ గ్రామానికి కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. అక్కడ ప్రజలకు సరైన ఇళ్లు, సాగునీటి వసతులు కూడా లేవు" అని నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు.2004లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ఆయన తెలిపారు. "ఆ ఒక్క గ్రామానికే 500 ఇళ్లు మంజూరు చేశాం. 4 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రెండు చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. కోటి రూపాయల ఖర్చుతో 9 కిలోమీటర్ల రోడ్డు వేశాం. దీంతో గ్రామానికి బస్సు సౌకర్యం కూడా వచ్చింది. అంతేకాకుండా, ఎంపీపీ పదవిని కూడా ఆ గ్రామస్థులకే ఇచ్చాం" అని తాను చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అయితే, ఎన్నికల ఫలితాలు మాత్రం ఆశ్చర్యపరిచాయని ఆయన అన్నారు. "ఇంత అభివృద్ధి చేయకముందు జరిగిన ఎన్నికల్లో ఆ గ్రామంలో మాకు 300 ఓట్ల మెజారిటీ వచ్చింది. కానీ, ఇన్ని పనులు చేశాక జరిగిన ఎన్నికల్లో కేవలం 30 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది" అని కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. దీనిపై తాము విశ్లేషణ చేసుకోగా అసలు కారణం తెలిసిందన్నారు. "మాతో ఉంటూ ఆ గ్రామానికి చెందిన కొందరు స్థానిక నేతలు ఆర్థికంగా ఎదిగారు. వారిపై మిగిలిన గ్రామస్థుల్లో అసూయ పెరిగింది. మాకు ఓటు వేస్తే ఆ నేతలకు పేరు వస్తుందని భావించిన ప్రజలు, వారిని దెబ్బ తీయాలనే ఉద్దేశంతో నాకు వ్యతిరేకంగా ఓటు వేశారు" అని అసలు విషయం చెప్పారు. రాజకీయాల్లో గెలుపునకు ఫార్ములా ఏమీ ఉండదని, ఇది చేస్తే గెలుస్తాం, అది చేస్తే ఓడిపోతాం అని చెప్పలేమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతిమంగా భగవంతుడి అనుగ్రహం ఉండాలని, రాజకీయాల్లో ఆ భగవంతుడు ఓటరు మహాశయులేనని వ్యాఖ్యానించారు. ఓటర్లు తలచుకుంటేనే గెలుస్తామని, లేదంటే ఓడిపోతామని తన రాజకీయ అనుభవ సారాంశాన్ని ఆయన పంచుకున్నారు.

## చర్చలకు సిద్ధం.. కానీ లొంగిపోయే ప్రసక్తే లేదు: ఇరాన్ అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు

అమెరికా సహా పాశ్చాత్య దేశాలు విధిస్తున్న ఆర్థిక, దౌత్యపరమైన ఆంక్షలపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా స్పందించారు. శాంతియుత చర్చలకు తాము ఎల్లప్పుడూ సిద్ధమే అయినా, బలవంతపు ఆంక్షలు, బెదిరింపులతో తమను లొంగదీసుకోవచ్చని భావిస్తే అది అపోహే అవుతుందని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ దేశాలతో పరస్పర గౌరవంతో కూడిన సంబంధాలనే కోరుకుంటున్నామని, అయితే తమ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.టెహ్రాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "ఇరాన్ ఏ దేశంతోనూ యుద్ధాన్ని గానీ, ఉద్రిక్తతలను గానీ కోరుకోవడం లేదు. ప్రాంతీయ, అంతర్జాతీయ వివాదాలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధం" అని తెలిపారు. అయితే, చర్చల పేరుతో ఏకపక్ష నిబంధనలు రుద్దాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. "ఆంక్షలు, బెదిరింపుల ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవచ్చని ఎవరైనా భావిస్తే అది వారి భ్రమే అవుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని విస్తరిస్తోందన్న ఆరోపణలతో అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) గత కొన్నేళ్లుగా ఆ దేశంపై కఠిన ఆర్థిక ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడి మరింత పెరుగుతోంది. ఈ క్రమంలో, దేశ ప్రయోజనాల విషయంలో కఠినంగా ఉంటామని పెజెష్కియాన్ అంతర్జాతీయ సమాజానికి స్పష్టమైన సందేశం ఇచ్చారు.బాహ్య ఒత్తిడిని తట్టుకునేందుకు స్వయం సమృద్ధి సాధించడం, చైనా, రష్యా వంటి ఆసియా దేశాలతో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తున్నామని అధ్యక్షుడు పెజెష్కియాన్ తెలిపారు. పాశ్చాత్య దేశాలతో ఆంక్షల నుంచి ఉపశమనం కావాలంటే అది సమానత్వ ప్రాతిపదికన జరిగే చర్చల ద్వారానే సాధ్యమవుతుందని ఆయన పునరుద్ఘాటించారు.



# మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి







- సుమారు 200 మంది మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ
- స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు
- సొంత కాళ్లపై నిలబడి ఆర్థికంగా ఎదగడానికి కుట్టు మిషన్లు దోహదం

**నిజామాబాద్ మన దునియా ప్రతినిధి :**

మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, వారి ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 200 మంది లబ్ధిదారులకు ఉచిత కుట్టు మిషన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, లబ్ధిదారులు ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.కుట్టు మిషన్లు పొందిన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని కుట్టు పనిని ఉపాధిగా మలుచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇంటి వద్దనే పని చేసుకుంటూ ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉండటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని కేవలం సంక్షేమంగా మాత్రమే కాకుండా స్వయం ఉపాధికి పెట్టుబడిగా భావించి లబ్ధిదారులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కుట్టు మిషన్లు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి మహమ్మద్ అబ్దుల్ బషీర్ , ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు బాల్ రాజు, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పొలసాని శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, మైనారిటీ నాయకులు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం  లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఆగస్టు । ఆదివారం । 9 । 2026



# వార్మప్ మ్యాచ్‌లో సెంచరీతో మెరిసిన పడిక్కల్... లంక ఎలెవన్ స్కోరుకు చేరువలో భారత్

**శ్రీలంకతో వార్మప్ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ అజేయ శతకం**

**తొలి టెస్టుకు దూరమైన సాయి సుదర్శన్ స్థానం కోసం గట్టి పోటీ**

**రవీంద్ర జడేజా కూడా బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో రాణింపు**

**చివర్లో కేవలం 18 బంతుల్లో 36 పరుగులు చేసిన గుర్నూర్ బ్రార్**

**శ్రీలంక బోర్డు XI స్కోరుకు 6 పరుగుల దూరంలో నిలిచిన భారత్**



లంక పర్యటనలో భాగంగా శ్రీలంక ఎలెవన్ జట్టుతో జరుగుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో చెలరేగాడు. తొలి టెస్టుకు రెగ్యులర్ బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా దూరమవడంతో, ఆ స్థానం కోసం తను సిద్ధంగా ఉన్నానంటూ పడిక్కల్ సెలక్టర్లకు బలమైన సంకేతం పంపాడు. శనివారం నాటి రెండో రోజు ఆటలో పడిక్కల్ (142 నాటౌట్) అజేయ శతకంతో కదం తొక్కడంతో పాటు, రవీంద్ర జడేజా (63) కూడా రాణించాడు.దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది. అంతకుముందు శ్రీలంక ఎలెవన్ జట్టు తొలి ఇన్నింగ్స్ ను 363/8 వద్ద డిక్లేర్ చేయగా, ఆ స్కోరుకు భారత్ మరో 6 పరుగుల దూరంలో ఉంది. మొత్తం మీద సాయి సుదర్శన్ గైర్హాజరీలో, పడిక్కల్ అద్భుత ఫామ్‌తో నమ్మకమైన ప్రత్యామ్నాయంగా నిలిచాడు. కొలంబోలోని నాన్‌డిస్క్రిప్ట్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) డకౌట్‌గా వెనుదిరిగాడు. అయితే, క్రీజులోకి వచ్చిన పడిక్కల్ ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా దూకుడుగా ఆడాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (40)తో కలిసి రెండో వికెట్‌కు కీలకమైన 96 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. తన క్లాస్ షాట్లతో అలరించిన పడిక్కల్, సెంచరీ పూర్తి చేసుకున్న తర్వాత (103 వద్ద) ఇతర బ్యాటర్లకు అవకాశం ఇచ్చేందుకు రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (1) త్వరగా ఔటైనా, రవీంద్ర జడేజా.. మానవ్ సుతార్ (41)తో కలిసి మరో విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. జడేజా కూడా హాఫ్ సెంచరీ తర్వాత రిటైర్డ్ ఔట్ అయ్యాడు. చివర్లో గుర్నూర్ బ్రార్ (18 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్సులు) విధ్వంసకర బ్యాటింగ్‌తో అలరించాడు. తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన పడిక్కల్ తన స్కోరును 142 పరుగులకు చేర్చుకున్నాడు.

# శ్రీలంక సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో షాక్.. సాయి సుదర్శన్ దూరం!

**నంబర్-3 స్థానంపై టీమిండియాలో చర్చ**

**వార్మప్‌లో సెంచరీతో రేసులోకి పడిక్కల్**

**బుమ్రా, హర్షిత్ రాణా, నితీశ్, సుందర్ కూడా దూరం**

**డబ్ల్యూటీసీ పాయింట్ల కోసం భారత్, శ్రీలంక పోరు**


**2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో భారత్‌కు సిరీస్ కీలకం**

**కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి భారత్**

శ్రీలంకతో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో కీలకమైన నంబర్-3 స్థానంపై జట్టు మేనేజ్‌మెంట్ మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెస్టుల్లో సుదర్శన్ అరంగేట్రం చేసిన తర్వాత మూడో స్థానంలో భారత్ ప్రధాన ఎంపికగా మారాడు. అయితే ఆ స్థానాన్ని పూర్తిగా సుస్థిరం చేసుకోకముందే గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీ చేయడంతో అతడికి మూడో స్థానంలో అవకాశం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.సుదర్శన్‌కు ముందు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ కూడా గాయాలతో అందుబాటులో లేరు. దీంతో శ్రీలంక పర్యటనకు భారత్ కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనుంది.సుదర్శన్ ఎంపిక సమయంలోనే అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. కాలి గాయం నుంచి కోలుకుంటున్న అతడికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. తాజాగా అతడు సిరీస్‌కు పూర్తిగా దూరమైనట్లు తేలింది.రెండు టెస్టుల సిరీస్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పరంగా భారత్‌కు కీలకం. ప్రస్తుతం భారత్ ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. 2027 డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ముందుకు వెళ్లాలంటే ఇరు జట్లకు ఈ సిరీస్‌లో పాయింట్లు కీలకం.సుదర్శన్ గైర్హాజరీతో భారత్ బ్యాటింగ్ కూర్పులో మార్పులు తప్పనిసరయ్యాయి. పడిక్కల్ సెంచరీ చేయడంతో నంబర్-3 స్థానానికి పోటీ ఆసక్తికరంగా మారింది. మరోవైపు కీలక బౌలర్లు దూరం కావడంతో శ్రీలంక సిరీస్ టీమిండియా బెంచ్ బలానికి పరీక్షగా మారనుంది.



# వైభవ్ సూర్యవంశీని చూసి ధావన్ ఫిదా.. ఆ ఒక్క లక్షణమే కారణమట!






యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ ప్రశంసలు కురిపించారు. 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గొప్ప విషయమని అన్నారు. షాట్లు ఆడే నైపుణ్యం ఉండటం ఒకటైతే.. వాటిని ఆడే ధైర్యం ఉండటం మరో విషయమని చెప్పారు."వైభవ్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. 15 లేదా 16 ఏళ్లకే అంతర్జాతీయ స్థాయికి చేరడం చాలా గొప్ప విషయం. ఐపీఎల్‌లోనూ అతడు అద్భుతంగా ఆడాడు. ఫోర్లు, సిక్సర్లు కొట్టే విధానం ఆకట్టుకుంటోంది. నైపుణ్యం ఉండటం ఒక విషయం. కానీ 15 ఏళ్ల వయసులోనే ఆ షాట్లు ఆడే ధైర్యం ఉండటం చాలా ప్రత్యేకం" అని ధావన్ అన్నారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన మూడు టీ20ల్లో వైభవ్ 151 పరుగులు చేశాడు. దీంతో తొలిసారి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు అందుకున్నాడు. ఈ సిరీస్‌ను భారత్ 3-0తో గెలిచింది. అంతకుముందు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్.. టీమిండియా తరఫున ఆడిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు.ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్ 776 పరుగులు చేశాడు. 237.30 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. ఒక సెంచరీ, ఐదు అర్ధ సెంచరీలు సాధించాడు. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. ఎమర్జింగ్ ప్లేయర్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్ సహా పలు అవార్డులు గెలుచుకున్నాడు. అండర్-19 ప్రపంచకప్‌లోనూ 439 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచాడు.ఇదిలా ఉండగా.. ధావన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని పితంపురలో ఓ పాఠశాలలో రుజువీ ల్యాబ్‌ను ప్రారంభించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితంపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే దీని లక్ష్యం. ఈ ల్యాబ్‌తో 2,500 మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. డిజిటల్ విద్యా కార్యక్రమాల ద్వారా ఇప్పటికే 50 వేల మంది పిల్లలకు తమ ఫౌండేషన్ చేరువైందని ధావన్ తెలిపారు.

# హార్దిక్ బదులు ఆ ఇద్దరినీ ఇవ్వండి.. కేకేఆర్‌కు అశ్విన్ షరతు

ఐపీఎల్ వర్గాల్లో ముంబై ఇండియన్స్ (MI) కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌కు సంబంధించి ప్రస్తుతం జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఒకవేళ ముంబై ఇండియన్స్ హార్దిక్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖఖ=)కు ట్రేడ్ చేయాలని భావిస్తే, దానికి బదులుగా ఆ జట్టు నుంచి స్టార్ ప్లేయర్లు రింకూ సింగ్, హర్షిత్ రాణాలను తీసుకోవాలని ఆయన సూచించారు. అప్పుడే ఈ ట్రేడ్ ముంబై జట్టుకు ప్రయోజనకరంగా ఉంటుందని అశ్విన్ స్పష్టం చేశారు. వచ్చే ఐపీఎల్ సీజన్‌కు ముందు హార్దిక్‌ను చెన్నై సూపర్ కింగ్స్ (CSK) లేదా కేకేఆర్‌కు ముంబై యాజమాన్యం ట్రేడ్ చేయవచ్చని వస్తున్న వార్తలపై అశ్విన్ తన విశ్లేషణను పంచుకున్నారు. హార్దిక్ చేరిక వల్ల సీఎస్కే కంటే కేకేఆర్‌కే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "హార్దిక్‌తో కేకేఆర్ బ్యాటింగ్ లైనప్ అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. ఏ ట్రేడ్ చేసినా ప్రత్యర్థి జట్టు మనకంటే బలంగా మారకుండా జాగ్రత్త పడాలి" అని ముంబై ఇండియన్స్‌కు ఆయన హితవు పలికారు.2015లో ముంబై ఇండియన్స్‌తో ఐపీఎల్ అరంగేట్రం చేసిన హార్దిక్, 2022లో గుజరాత్ టైటాన్స్‌కు సారథిగా వ్యవహరించి తొలి సీజన్‌లోనే టైటిల్ అందించారు. అయితే తిరిగి ముంబైకి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జట్టు ప్రదర్శన నిరాశపరిచింది. 2024లో చివరి స్థానంలో నిలిచిన ముంబై, 2026 సీజన్‌లో 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ వైఫల్యాల నేపథ్యంలోనే ఆయన ట్రేడింగ్‌పై వస్తున్న వార్తలు మరింత ఊపందుకున్నాయి.




మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## చివరి నిమిషంలో మోహన్‌లాల్ సిడ్నీ షో వాయిదా.. కారణమిదే!



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సిడ్నీలో నిర్వహించాల్సిన లైవ్ షో చివరి నిమిషంలో వాయిదా పడింది. ఆస్ట్రేలియా వీసా సకాలంలో మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. "వైకిట్టు ఎంథ పరిపాడి" పేరిట ఈ కార్యక్రమాన్ని శనివారం సిడ్నీలోని నార్వెస్ట్ కన్వెన్షన్ సెంటర్‌లో కాయల్ ఈవెంట్స్ సంస్థ నిర్వహించాల్సి ఉంది. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు ప్రముఖ గాయని కేఎస్ చిత్ర, నటుడు మనోజ్ కే జయన్ సహా ఇతర కళాకారులు ఇప్పటికే ఆస్ట్రేలియా చేరుకున్నారు. అయితే, వీసా క్లియరెన్స్ కోసం సింగపూర్‌లో వేచి చూస్తున్న మోహన్‌లాల్‌కు అనుమతి లభించకపోవడంతో ఆయన ప్రయాణం రద్దయింది. వీసా దరఖాస్తు తిరస్కరణకు గురికాలేదని, కేవలం ప్రాసెసింగ్‌లో అనుకోని జాప్యం జరిగిందని నిర్వాహకులు స్పష్టం చేశారు. త్వరలోనే కార్యక్రమ తదుపరి తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ పరిణామంపై మోహన్‌లాల్ వీడియో సందేశం ద్వారా అభిమానులకు క్షమాపణలు తెలిపారు. "ఇది ఎలా జరిగిందో నాకు తెలియదు. సాంకేతిక కారణమో లేక క్లరికల్ పొరపాటో ఏదైనా కావచ్చు, దీనికి పూర్తి బాధ్యత నేనే వహిస్తున్నాను. నేను రాలేకపోతున్నాందుకు అందరికీ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఇదే బృందంతో మళ్లీ ప్రదర్శన ఇస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

## వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు హైకోర్టులో చుక్కెదురు!



టాలీవుడ్ ప్రముఖులు దగ్గుబాటి వెంకటేశ్, సురేశ్ బాబు, రానాలకు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఫిల్మ్‌నగర్‌లోని ప్రసిద్ధ 'డెక్కన్ కిచెన్' ప్రాపర్టీ వివాదానికి సంబంధించి నాంపల్లి కోర్టులో తమపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. తుకారాంజీ తిరస్కరించారు. వెంకటేశ్, సురేశ్ బాబు, రానాతో పాటు దగ్గుబాటి అభిరామ్, అకౌంటెంట్ గడ్డం విశ్వనాథమ్‌లు సమర్పించిన రద్దు (క్వాష్) పిటిషన్‌లో ఎలాంటి బలమైన కారణాలు లేవని స్పష్టం చేస్తూ కొట్టివేశారు. లీజు గడువు ముగియకముందే దగ్గుబాటి కుటుంబం జీహెచ్ఎంసీ అధికారులతో కుమ్మక్కై తమ ప్రాపర్టీలోకి అక్రమంగా ప్రవేశించిందని, అక్కడి నిర్మాణాలను బలవంతంగా కూల్చివేసి బెదిరింపులకు దిగారని కోరె నందు కుమార్ గతంలో కేసు పెట్టారు. ఇది కేవలం లీజుకు సంబంధించిన సివిల్ వివాదమని, క్రిమినల్ కేసు కాదని నిందితులు వాదించినప్పటికీ... ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు చట్టబద్ధమైన ప్రాతిపదిక లేదని స్పష్టం చేసిన హైకోర్టు, నాంపల్లి కోర్టులోని విచారణ కొనసాగేలా ఆదేశించింది.

## పోస్టర్లపై కలెక్షన్ల లెక్కలన్నీ నిజం కాదు: నిర్మాత నాగవంశీ సంచలన వ్యాఖ్యలు

సినిమా పోస్టర్లపై ప్రచురించే భారీ కలెక్షన్ల లెక్కలు నిజం కావని, ఈ విషయం ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులకు కూడా స్పష్టంగా తెలుసని ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. బాక్సాఫీస్ ఫేక్ నంబర్ల వెనుక ఉన్న అసలు నిజాన్ని బయటపెట్టారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నాగవంశీ మాట్లాడుతూ.. "సినిమా ప్రచార పోస్టర్లపై వేసే కలెక్షన్ల నంబర్లు వాస్తవం కాదనే విషయం ఐటీ అధికారులకు బాగా తెలుసు. ప్రతి సినిమాకు సంబంధించిన అసలైన కలెక్షన్ల డేటా మొత్తం వారి దగ్గర ముందే ఉంటుంది. అందుకే మేము పోస్టర్లపై ఎంత ఎక్కువ మొత్తం చూపించినా, ఐటీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావు" అని నిర్మొహమాటంగా వెల్లడించారు. సినిమా ప్రమోషన్ల సమయంలో హీరోలు, నిర్మాతలు మాట్లాడే తీరు బట్టి సినిమా ఫలితంపై ప్రేక్షకులకు ఒక అంచనా వస్తుందని నాగవంశీ అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఆయన ఫేక్ కలెక్షన్ల పోస్టర్ల గురించి మాట్లాడారు. ఒక ప్రముఖ నిర్మాత బాక్సాఫీస్ లెక్కల గురించి ఇంత బహిరంగంగా మాట్లాడటంతో ఆయన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో టాలీవుడ్‌లో కలెక్షన్ల పోస్టర్ల వ్యవహారం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.




## 'విశ్వనాథ్ & సన్స్' సెన్సార్ పూర్తి.. రిలీజ్‌కు రెడీ

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' విడుదలకు సర్వం సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఖ/గూ సర్టిఫికెట్‌ను పొందింది. స్వాతంత్ర్య దినోత్సవ వారాంతాన్ని పురస్కరించుకుని ఆగస్టు 14న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' వంటి చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్న యువ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఇందులో సూర్య.. సంజయ్ విశ్వనాథ్ అనే 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ట్రైలర్‌లో సూర్య స్టైలిష్ లుక్, అతడి నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా, స్టైల్, టైమింగ్ కామెడీ, భావోద్వేగాలను మిళితం చేస్తూ అతడి పాత్రను తీర్చిదిద్దిన విధానంపై ప్రశంసలు వస్తున్నాయి. 'విశ్వనాథ్ ౘ సన్స్' చిత్రంలో సూర్య సరసన 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా నటించింది. ట్రైలర్‌లో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని తెలుస్తోంది. రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండటంతో ఇది పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కూడా ఉండబోతుందని స్పష్టమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ అందించిన సంగీతం, నిమిష్ రవి సినిమాటోగ్రఫీ సినిమాకు అదనపు బలాన్ని చేకూర్చనున్నాయి. ఓవరాల్ గా యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న 'విశ్వనాథ్ ౘ సన్స్' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



## డెంగ్యూతో ఆస్పత్రిలో చేరిన అవికా గోర్

నటి అవికా గోర్ డెంగ్యూ బారిన పడి ఆస్పత్రిలో చేరారు. ఈ విషయాన్ని ఆమె భర్త మిలింద్ చాంద్వానీ శుక్రవారం రాత్రి సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. దాదాపు ఐదు రోజులుగా 103–104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ అవికా తన వృత్తిపట్ల ఉన్న అంకితభావంతో షూటింగ్‌లకు హాజరయ్యారని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ వీడియోలో మిలింద్ మాట్లాడుతూ.. అవికా ఆరోగ్యం క్షీణించడంతో గురువారం రాత్రి ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు. ఐదు రోజులుగా ఆమెకు 103 నుంచి 104 డిగ్రీల వరకు జ్వరం ఉన్నట్లు వెల్లడించారు. అయినప్పటికీ అవికా ముందుగా రెండు రోజుల ప్రాజెక్టు షూటింగ్‌ను పూర్తి చేశారని మిలింద్ తెలిపారు. ఆమె ప్రతిభతో రెండు రోజుల్లో పూర్తి చేయాల్సిన షూటింగ్ ఒక్క రోజులోనే పూర్తయిందన్నారు. అనంతరం ఇంటికి వచ్చి మందులు తీసుకున్న అవికా.. కొంత విరామం తర్వాత ప్రకటన షూటింగ్ కోసం ఢిల్లీకి వెళ్లారని చెప్పారు. షూటింగ్‌ను వాయిదా వేస్తే నిర్మాతలకు నష్టం కలుగుతుందనే ఉద్దేశంతోనే ఆమె ఢిల్లీ వెళ్లినట్లు మిలింద్ తెలిపారు. అయితే వైరస్ సోకలేదని నిర్ధారించుకునేందుకు పరీక్షలు చేయించుకున్న తర్వాతే ఆమె ప్రయాణించారని, అదృష్టవశాత్తూ ఇతర వైరస్ ఏదీ లేదని చెప్పారు. "షూటింగ్‌ను వాయిదా వేయమని, నిర్మాతలు అర్థం చేసుకుంటారని నేను చాలాసార్లు చెప్పాను. కానీ ఆమె ఎవరి సమయం, ఎవరి డబ్బు వృథా కాకూడదని భావించింది. చేయగలిగినంత పని చేయాలని చెప్పింది" అని మిలింద్ పేర్కొన్నారు. అవికాకు తన పని పట్ల ఉన్న గౌరవం, అంకితభావాన్ని తాను ఎప్పుడూ మెచ్చుకుంటానని ఆయన అన్నారు. ఆమె వృత్తిపట్ల చూపిస్తున్న నిబద్ధత స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. అవికా త్వరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థించాలని మిలింద్ కోరారు. అదే సమయంలో ఆమె నటించిన కొత్త పాట 'బుఖార్' (జ్వరం) కూడా అదే రోజు సాయంత్రం 6 గంటలకు విడుదల కానుండటంపై ఆయన ఆసక్తికరంగా స్పందించారు. అవికా ఎక్కువగా సోషల్ మీడియాలో అందుబాటులో ఉండలేకపోతున్నందున ఆమె తరఫున అభిమానులు పాటను ప్రమోట్ చేయాలని కోరారు. తర్వాత అవికా కూడా ఆస్పత్రి బెడ్ నుంచి కొన్ని ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఓ ఫొటోలో చిరునవ్వుతో విక్టరీ సైన్ చూపిస్తూ.. "ఈ రోజు నా ప్లేట్‌లెట్ కౌంట్‌తో పాటు నన్ను ఉత్సాహపరుస్తున్న ఏకైక విషయం.. 'బుఖార్' రాత్రి 6 గంటలకు విడుదలవుతోంది. డెంగ్యూ చాలా ఇబ్బందికరం!" అంటూ పోస్ట్ చేశారు. మరో ఫొటోలో ఆమె చేతికి ఐవీ డ్రిప్ అమర్చిన దృశ్యం కనిపించింది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా 'బాలికా వధు' టీవీ సీరియల్‌తో అవికా గోర్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇందులో చిన్న ఆనందీ పాత్రలో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారు. ఆ తర్వాత 'ససురాల్ సిమర్ కా' వంటి ప్రముఖ టీవీ సీరియళ్లలో నటించారు. అనంతరం తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమల్లోనూ తన కెరీర్‌ను విస్తరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com